మధ్యాహ్నం పన్నెండయింది. ఆయన్ని లేపి, భోజనానికి రమ్మని చెప్పింది. ఆయన కాళ్ళు కడుక్కువచ్చేలోపల వంటింట్లో పీటవేసి కంచంపెట్టి, వడ్డించి వుంచింది.

"నువ్వు వడ్డించుకోకపొయ్యావా?" అన్నాడు.

"మీరు తిన్నాక తింటాను!"

జానకిరామయ్య తలొంచుకుని భోజనం చెయ్యసాగాడు.

"మీ ఆరోగ్యం ఎలావుంది?"

"చూస్తున్నావుగా!"

"మళ్ళీ పెళ్ళి చేసుకోలేదా?"

ఆ మాటకు జానకిరామయ్య బెరుకు బెరుగ్గా సుజాత కళ్ళలోకి చూశాడు. చూసి, "మళ్ళీ పెళ్ళి ఎందుకూ? ఓ అనుభవం అయిందిగా" అన్నాడు. అని చెయ్యి కడుక్కుని లేచిపొయ్యాడు.

సుజాతకు దుఃఖం పొర్లుకువచ్చింది ఉప్పెనలా! తల గడపకేసి కొట్టుకుని, "పాపిష్టిదాన్ని! తినేఅన్నం వదిలేసి వెళ్ళారు." ఛఛ! నేనా ప్రస్తావన తేకుండా వుండాల్సింది." అని అన్నది.

సుజాత ప్రవర్తన జానకిరామయ్యకు విచిత్రంగా తోచింది.

"నా తిండేముంది! నాకేం బాధపడకు. నువ్వు అన్నం తిను!"

"అంత పాపం చేశానండీ. మిమ్మల్ని ప్రేమతో చూసి నేను తిన లేనండీ!"

"నా నొసట ఇలా వ్రాసిపెట్టివుంటే ఆ సంగతి నీకు తెలియదా!" అన్నాడు.

"అంటే?"

"నువ్వు అన్నంతిని రా చెబుతాను!"

"కాదు చెప్పండి! అదేదో ఇదేదో తెల్సుకోటానికి వచ్చాను!"

"చూసిపోతా వనుకున్నాను!"

"కాదు వుండిపోదామనే వచ్చాను."

"సరే! నన్నుగూడ ఆలోచించుకోనీ!"

"మీ నిర్ణయం తెలిపేదాకా అన్నం తినను." సుజాత కొంగు పరచుకుని పడుకుంది.

జానకిరామయ్యకు ఏం చెయ్యాలో తోచలేదు క్షణం.

లాల్చీవేసుకుని, చెప్పులు తొడుక్కుని, "నేనలా వెళ్ళివస్తాను. వచ్చాక నా చరిత్రంతా చెబుతాను!" అని తలుపు దగ్గరకువేసి వెళ్ళిపోయాడు.

సుజాత అలాగే పడుకున్నది, గత వర్తమానాలు కళ్ళముందు తిరుగాడుతుండగా అలాగే సొమ్మసిల్లి నిద్ర పోయింది.

మళ్ళీ మెలకువ వచ్చేసరికి, పొద్దు పడమటకు జారింది. వళ్ళంతా చెమట్లు పట్టి వళ్ళ చమటపట్టింది. ఉలిక్కిపడి పైట కొంగు, జారుకున్న జాకెట్టు సరిచేసింది. లేచివెళ్ళి పిన్నిగారితో ముహం కడుక్కువచ్చింది. అప్పుడు దిల్లమీదున్న ఉత్తరం చూసింది.

